క్లుప్తంగా

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 98 రోజులకు గాను హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.20.36 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మోకా అరుణ్ కుమార్ తెలిపారు. ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు, మహిళా మండలి సభ్యులు, దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, ఆకివీడు గ్రూప్ దేవాలయాల ఈఓ అల్లూరి సత్యనారాయణ రాజు సమక్షంలో హుండీను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. దాదాపు 98 రోజులుకు గాను రూ.20,36,795 వచ్చిందని ఆయన వివరించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..!



భీమవరం బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న టాన్స్‌ఫార్మర్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని బస్టాండ్ ప్రహారీ గోడ వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకోవడంతో ప్రమాదకరంగ మారింది. నిత్యం అనేక మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో కావడంతో మొక్కల ద్వారా విద్యుత్తు ప్రవహించే ప్రమాదముంది. సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ ఎత్తుల్లో పెట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ కొనుగోలుకు సాయం



స్టడీమెటీరియల్ కోసం నగదు అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వరం లాంటిదని పెదపుల్లేటి రామరాజు మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు కలిదిండి ఇంద్రరాజు చెప్పారు. స్థానిక జెడ్పీ బాలురున్నత పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు స్టడీమెటీరియల్ కొనుగోలుకు రూ.23,100లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పిల్లల వైద్యుడు కె.మహేష్ వర్మ, ప్రధానోపాధ్యాయులు ఎం.పారనాయుడు, ఉపాధ్యాయులు ఎం.వెంకటస్వామి, పీ.అరవింద్, డీఎస్ఎల్ శారద పాల్గొన్నారు.

మెగా ఆక్వా ఫుడ్ పార్కును సందర్శించిన కలెక్టర్



ఆక్వా ఫుడ్ పార్కులోని యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కును గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. ఫ్యాక్టరీ చుట్టూ పరిసరాలను పరిశీలించి ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాల్సి ఉండగా ఎందుకు ఇవ్వలేకపోతున్నామని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్లాంట్ రావడానికి కృషి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద గ్రూప్ చైర్మన్ విశ్వనాథరాజు, మేనేజింగ్ డైరెక్టర్ జోగి వర్మ, కంతేటి సత్యనారాయణ రాజు, భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు తదితరులు ఉన్నారు.

అధికారులు ప్రజలకు సేవలందించాలి



ఎమ్మెల్యే అంజిబాబును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. రెవెన్యూ డే (జూన్ 20)ను పురస్కరించుకుని గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భీమవరం తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే అంజిబాబుకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. తహసీల్దార్ రావి రాంబాబు, డీటీ, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చదువుకొనలేక అవస్థలు

- పిల్లల చదువులపై ఫీజుల బాదుడు
- ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలల వ్యవహారం
- విద్యాసామగ్రి పేరిట అదనపు వసూళ్లు

కాళ్ల: గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అవి నేడు కానరాకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల బాటపడుతున్నారు. దీంతో కార్పొరేట్ పాఠశాలలో విద్యను కొనుక్కునే పరిస్థితి వచ్చింది. ఫలితాలు, ర్యాంకులను బేరీజు వేసుకుంటూ సామాన్య, మధ్య తరగతి వర్గాలు సైతం తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠ శాలల్లో చదివించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు విద్యాసంస్థలు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా ఏటేటా ఫీజులు పెంచేస్తున్నాయి. ఇది చాలదు అన్నట్లు పుస్తకాలు, యూనిఫాం, విద్యాసామగ్రి పేరిట అదనపు భారం మోపుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించొద్దంటూ విద్యాశాఖ అధికారులు ఇస్తున్న ఆదేశాలను ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

నియోజకవర్గంలో ఉండి, కాళ్ల, ఆకివీడు పాలకోడేరు మండలాల్లో సుమారు 50కి పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే. విద్యార్థులను ఇబ్బడిముబ్బడిగా చేర్చుకున్నారు. సీట్లు పూర్తయిపోతున్నాయంటూ నమ్మబలికి ముందస్తుగానే తొలి విడత ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు నిర్వాహకులు అప్లికేషన్‌తోనే చేరుకుని, ఆ తర్వాత వివిధ రూపాల్లో తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. తీరా పాఠశాలలో చేర్పించాక చేసేదేమీ లేక తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. యూనిఫాం, పుస్తకాలు, ఇతర సామగ్రి కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేయాలంటూ యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. వీటికి ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు లాగేస్తున్నారు. ఆపై తరగతుల విద్యార్థులకు కొత్త కోర్సులంటూ అదనంగా వసూలు చేస్తున్నారు. స్కూల్ బస్సుల ఫీజులను అడ్డగోలుగా పెంచేస్తున్నారని.. మరో గత్యంతరం లేక వారు అడిగినంత చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఓ ప్రైవేటు పాఠశాలల్లో అమ్ముతున్న పుస్తకాలు

ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యం

చాలా వరకు ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు కల్పించకుండా ఇరుకుగదుల్లోనే పాఠాలు చెబుతున్నారు. క్రీడా మైదానాలు ఉండవు.. తల్లిదండ్రుల కమిటీలు కాగితాల్లోనే ఉంటాయి. పేద విద్యార్థులకు రాయితీపై విద్యనందించాలని ప్రభుత్వం సూచించినా పట్టించుకోవడంలేదు. ఫీజుల్లో ల్లో కొంత స్కూలు నిర్వహణ, సిబ్బంది ప్రయోజనాలకు వెచ్చించాలనే నిబంధన ఏ స్కూల్లోనూ అమలు కావడం లేదు.

అధిక ఫీజులను నియంత్రించాలి



ఏటా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం మోయలేకపోతున్నాం. ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫామ్ స్కూళ్లలోనే కొనాలని ఒత్తిడి చేస్తున్నారు. పుస్తకాలు రూ.వేలల్లో విక్రయిస్తున్నారు. పాఠ్య పుస్త కాలు రూ.వందల్లో అయితే మెటీరియల్ మాత్రం రూ.5 వేలకు పైగానే విక్రయిస్తూ భారం మోపుతున్నారు. అధికారులు ఫీజులను నియంత్రించాలని కోరుతున్నాం.

– గుర్రం బెనాహర్, జువ్వలపాలెం

ఫీజులపై ఫిర్యాదు చేస్తే చర్యలు



ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించరాదు. అధిక ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు, దుస్తులు స్కూల్లోనే కొనాలని స్కూల్ యాజమాన్యాలు ఇబ్బందులు పెడితే తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే ఆ యాజమాన్యం తగు చర్యలు తీసుకుంటాం.

–ఎ.రవీంద్ర, ఎంఈవో

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

ఉండి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లల్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయని ఫైర్ అధికారి భీమవరం సూర్యబ్రహ్మం తెలిపారు. మహదేవపట్నం ఉత్తరపాలెం ప్రాంతంలో కుడిపూడి పద్మావతికి చెందిన రెండంతస్తుల భవనంలో ఒకదానిలో యజమాని అయిన పద్మావతి ఉంటుండగా మరోక అంతస్తులో లంక అమ్మాజీ అద్దెకు ఉంటున్నారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో అమ్మాజీ ఉంటున్న ఇంట్లో ఫ్రిడ్జ్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో రెండు అంతస్తుల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలిపోయాయి. ఆ ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు భీమవరం అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సూర్యబ్రహ్మం ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేశారు.

ఎల్‌పీఎం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

పాలకోడేరు: మండంలోని గరగపర్రు గ్రామంలో జాయింట్ ఎల్‌పీఎంఎంలు పట్టాదారులుగా నమోదైన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో జాయింట్ ఎల్‌పీఎంలు ఎన్ని ఉన్నాయి? వాటి మీద తీసుకున్న చర్యలు గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 439 జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నాయని, గ్రామంలో వారానికి రెండు రోజులు ప్రత్యేక క్యాంపులను నిర్వహించి సమస్యలను పరిష్కరించి, అర్హులైన వారికి అమ్మ ఒడి, అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ పథకాలకు ఇబ్బంది లేకుండా సబ్ డివిజన్ చేయించాలని అన్నారు. అనంతరం గరగపర్రు గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని రేషన్ షాపు నెంబర్ 43 సంబంధించిన నిత్యవసర సరుకులను కార్డుదారుల ఇంటికి వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సర్వే ఇన్చార్జి అధికారి కె.శ్రీనివాసరావు, డివిజనల్ సర్వే అధికారి మల్లికార్జునరావు, మండల సర్వేయర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీమవరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో రాణించాలని డీఎన్నార్ పాలక వర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. గురువారం డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే వారిని ప్రజలు ఉపేక్షించరాదన్నారు. యువత మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ, వాటి నివారణకు నడుం బిగించి మాదక ద్రవ్యాల రహిత సమాజానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మోజెస్, సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణంరాజు, వివిధ విభాగాల శాఖాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డీఎన్నార్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచనలు వెంటనే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జె ఎన్ వి గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారి తోట సుందరయ్య భవనంలో రాజకీయ విజ్ఞాన తరగతులు రెండో రోజు శిక్షణ తరగతులు జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం షరతులకు లొంగిపోయి ఈ దేశ సంపదను ఆదానికి కట్టబెట్టడం కోసం స్మార్ట్ మీటర్లు విధానాన్ని తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఆలోచన మానుకోవాలన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే ప్రజలపై ఎటువంటి భారాలు వేయ బోమని చెప్పి ప్రజలను దగా చేసిందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలపై భారాలు వేస్తే రానున్న కాలంలో కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి ప్రజలు సాగ నంపుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్లు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఇండస్ట్రీయల్ ఏరియా, ధర్మాపుర అగ్రహారం, దుంపగడప, ప్రాంతాలకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం 33/11కె వి ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్ పై లైన్ మైంటెనెన్స్, చెట్ల కొమ్మలు తొలగించుటకు 27వ తేది శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ)ఎన్. వెంకటేశ్వర రావు తెలిపారు. ప్రకాశంచౌక్, టౌన్‌హాల్ రోడ్డు, మావుళ్లమ్మ గుడి వీధి, సరాజు వారి స్ట్రీట్, తటవర్తి వారి స్ట్రీట్, రెస్ట్ హౌస్ రోడ్, కెజిఆర్ఎల్ కాలేజీ రోడ్, యనమదుర్రు కాలువ గట్టు, సండే మార్కెట్, భీమేశ్వర స్వామి రోడ్, సుంకరపద్దయ్య వీధి, బ్యాంకు కాలనీ, పోలీస్ బొమ్మ రోడ్, పెద్ద మసీదు రోడ్, వీరమ్మ పార్కుకి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ)ఎన్. వెంకటేశ్వర రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండిలో.

ఉండి: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎన్ వెంకటేశ్వరరావు గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండి,ఎన్నార్పీ అగ్రహారం,పెదపుల్లేరు, చినపుల్లేరు,కలిసిపూడి,చెరుకువాడ,మహదేవపట్నం,చిలుకూరు,వెలివర్రు గ్రామాలలోని గృహ అవసరాలతో పాటు ఇండస్ట్రీయల్ లైన్,ఆక్వా చెరువులకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అలాగే యండగండి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కూడా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు యండగండి, ఉణుదుర్రు గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్పష్టం చేశారు.

పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: భీమవరంలోని ఏపీ టిడ్కో ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం 33 /11 కేవీ నుంచి పెదగరువు వెళ్లే 33 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మలు, తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. తాడేరు, యమునాపల్లి, కొర్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, దిరుసుమర్రు, పల్లిపాలెం, పాతూరు, తుందుర్రు, జొన్నలగరువు గ్రామాలతో పాటు వీరవాసరం మండలంలోని దూసనపూడి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, బాలేపల్లి, గ్రామాలతో పాటు ఆక్వా చెరువుల లైన్లకు, తుందుర్రు గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కునకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అదేవిధంగా గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో వార్షిక మరమ్మతులు నిమిత్తం గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, తోకతిప్ప, బరువానిపేట, లోసరి, ఎల్‌వీఎన్ పురం, పల్లిపాలెం, ఈలంపూడి, నాగేంద్రపురం, దెయ్యాలతిప్ప, రామాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన

ఆకివీడు: మాదక ద్రవ్యాల సరఫరాను ప్రభుత్వం కఠినంగా అడ్డుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత విజ్ఞప్తి చేశారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువశక్తి నిర్వీర్యమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాస్, సర్కిల్ సీఐ వీ.జగదీశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.ఎక్‌డీపీఎస్ యాక్ట్ ద్వారా అక్రమ మద్యం, మారకద్రవ్యాల రవాణపై కఠిన చర్యలుంటాయన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన సెంటర్ నుంచి సాలిపేటలోని గాంధీ విగ్రహం వరకూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు నాగరాజు, ఎక్సైజ్ ఎస్సై కరుణ ప్రియ, కళాశాల మాదకద్రవ్యాల నిరోధక సెల్‌కోఆర్డినేటర్ డాక్టర్ టి.ఓగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత.

సాగుదారు హక్కు పత్రం పొందాలి

ఆకివీడు: ప్రతి కౌలుదారుడూ పంట సాగుదారు హక్కు పత్రం పొందే హక్కు ఉందని వ్యవసాయ సహాయ సంచాలకులు కేఏఎస్ఎస్ శ్రీనివాస్ చెప్పారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద గురువారం కౌలు పత్రాల్ని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు చేసే రైతులు తప్పనిసరిగా కార్డు పొందాలన్నారు. కౌలు కార్డులు సత్వరం అందజేసేందుకు తహసీల్దార్ ఎంఏఓల ఆధ్వర్యంలో రెండు బృందాల్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్డులు పొందేందుకు యజమాని పట్టాదారు పాస్ పుస్తకం లేదా ఆధార్ కార్డు జిరాక్స్, కౌలుదారు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్సుతో సంబంధిత వీఆర్‌ఓ, వీపీఏలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మధుమోహన్, వీఆర్వో మన్నే శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కౌలు కార్డులు అందజేస్తున్న ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సత్కారం

ఆకివీడు: ట్రిపుల్ ఐటీకి మండలంలోని మూడు జెడ్పీ స్కూళ్ల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు, బాలికోన్నత పాఠశాల నుండి ముగ్గురు, సిద్ధాపురం జెడ్పీ స్కూల్ నుంచి ఒకరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థుల్ని పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంపీ నాయుడు, ఫస్ట్ అసిస్టెంట్ ఎం.వెంకటస్వామి, ఎ.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహం సందర్శన

పాలకోడేరు: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో ఉన్న శిశుగృహ సంస్థను, వీరవాసరంలోని డివైన్ మెర్సి చిల్డ్రన్ హోమ్‌ను భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి సందర్శించారు. శిశు గృహంలో ఉన్న శిశువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిశువుకు ఇస్తున్న పాలను, మందులను పరిశీలించారు. డివైన్ మెర్సి చిల్డ్రన్ హోమ్‌లో ఉన్న పిల్లల భోజన వసతులను ఆరాతీశారు. ఆమె వెంట పారా లీగల్ వలంటీర్ కె.చంద్రరావు ఉన్నారు.

క్రమశిక్షణతో ఆరోగ్యకర జీవితం

భీమవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా క్రమశిక్షణతో ఆరోగ్యకర జీవితం గడపాలని భీమవరం పట్టణ ఎక్సైజ్ సీఐ కే.బలరామరాజు అన్నారు. గురువారం స్థానిక ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ×అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినం, ×నషా ముక్త భారత్ అభియాన్×కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వికేజే ప్రసూన, కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి .అరవింద స్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాస్‌రావు, ఎల్. నరసింహారావు, ఎస్. లక్ష్మీకాంతం, జి. ఉమామహేశ్వరి, డీవీవీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కే.బలరామరాజు

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

భీమవరం: ×మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, కలిగివున్నా, రవాణా చేసినా చట్ట రీత్యా నేరమని, తీవ్రతను బట్టి శిక్షలుంటాయని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీ నారాయణ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, కళాశాల డైరక్టర్ పి.శ్రీనావాసరాజు, ప్రిన్సిపాల్ ఎం.వేణు, ప్యానల్ న్యాయవాది పి.అంబేడ్కర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జవ్వాది సత్యనారాయణ, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

29న భీమవరానికి షర్మిల రాక

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఈ నెల 29న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల భీమవరం రానున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు గురువారం తెలిపారు.ఉదయం 11 గంటలకు జరిగే పార్టీ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

విద్యా సామగ్రి పంపిణీ

కాళ్ల: మండంలోని వేంపాడు మోడల్ ప్రైమరీ స్కూలులో దాతల సహకారంతో సుమారు రూ. 20 వేల విలువైన విద్యాసామాగ్రిని గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ యిర్రింకి పద్మావతి శ్రీనివాస్, పెద్దలు కోసూరి సత్యనారాయణరాజు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆర్థిక సహాయంతో సమకూర్చిన విద్యాసామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ వీరమల్లు పద్మశ్రీ, వైస్ చైర్మన్ దిగమర్తి స్వాతి పాల్గొన్నారు.